# ఓటు చోరీతోనే బండి సంజయ్ గెలుపు

- టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్
- గంగాధరలో కాంగ్రెస్ జనహిత పాదయాత్ర



**శెనార్తి మీడియా,కరీంనగర్ :**

కరీంనగర్‌లో బండి సంజయ్ విజయం ఓటు దోపిడీ ఫలితమని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. ఆదివారం గంగాధర మండలంలో కాంగ్రెస్ పాదయాత్రలో మాట్లాడుతూ, "లక్షల దొంగ ఓట్లు, ఒకే అడ్రస్‌పై వందల ఓట్లు, జీరో అడ్రస్‌లపై వేల ఓట్లు నమోదయ్యాయి. ఒకే ఎపిక్ నంబర్‌పై వేర్వేరు రాష్ట్రాల్లో ఓట్లు ఉండటం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం" అన్నారు. లోక్‌సభలో 8 బీజేపీ ఎంపీలు కూడా ఇదే తరహా అక్రమాలతో గెలిచారనే అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఎన్నికల సమయానికే బీజేపీకి దేవుళ్లు గుర్తొస్తారని ఎద్దేవా చేశారు. "దేవుళ్ల పేరుతో ఓట్లు అడిగే బిచ్చగాళ్లు అవుతున్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుపై ఢిల్లీ ఎదుట వంగిపోతూ బీసీ తరాలకు ద్రోహం చేస్తున్నారు" అని బండి సంజయ్‌పై మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ 100 సీట్లు గెలుస్తుందని, చొప్పదండిలో విజయోత్సవం జరుపుతామని చెప్పారు. కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ, "పేదల కష్టాలు తెలుసుకోవడానికే పాదయాత్ర చేస్తున్నాం. పేదల కళ్లలో ఆనందం చూడడమే మా ధ్యేయం" అన్నారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం "తన చివరి రక్తం బొట్టు వరకు ప్రజలకు సేవ చేస్తాను. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో దోచుకుంది" అన్నారు. మాజీ మంత్రి టి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు దేశంలో ఎక్కడా లేవు. పేదవాడికి పత్తెడు అన్నం, ఇళ్లు అందిస్తున్నాం" అన్నారు. రాజ్యసభ మాజీ సభ్యుడు వి. హన్మంతరావు "బీసీ రిజర్వేషన్లు ఇచ్చి తీరతాం. దేవుళ్ల పేరుతో బీజేపీ నాయకులు రాజకీయాలు చేస్తున్నారు" అని విమర్శించారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, గడ్డం వివేక్, ఎమ్మెల్యేలు, మాజీ మేయర్ బొంతు రాంమ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



# సీపీఎస్ ను రద్దు చేయాలి

**శెనార్తి మీడియా,ఆదిలాబాద్ :**

ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు పరిచి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయించడమే పీఆర్టీయూ తెలంగాణ ప్రధాన లక్ష్యమని పీఆర్టీయూ తెలంగాణ ఆదిలాబాద్ జిల్లా శాఖ అధ్యక్ష,కార్యదర్శులు ఆడే నూర్ సింగ్, నర్రా నవీస్ యాదవ్ అన్నారు. పీఆర్టీయూ తెలంగాణ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరిగిన విరమణ దీక్ష కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పదేండ్ల కింద రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఎస్ కావాలో ఓపీఎస్ కావాలో నిర్ణయించుకోవాలని అప్పటి కేంద్ర మంత్రి నిర్మలా సీతా రామన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరగా మాకు సీపీఎస్ విధానమే కావాలని, అప్పటి తెలంగాణ ప్రభుత్వం 2014 ఆగస్టు 23న కోరడం శోచనీయమని అన్నారు. అప్పటి నుండి పదేండ్ల పాటు ఉద్యోగ ఉపాధ్యాయుల పట్ల నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తూ వారిపై ఉక్కు పాదం మోపిందని అన్నారు. ఇటీవల ఒక సీపీఎస్ ఉద్యోగి ఉద్యోగ విరమణ పొందినప్పుడు వారికి రూ.1200 మాత్రమే పెన్షన్ రావడంతో ఆ ఉద్యోగి కుటుంబం ఎలా బ్రతకాలో ప్రభుత్వమే తెలుపాలని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు పరుస్తూ, సీపీఎస్ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్య క్షుడు హర్షవర్ధన్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా నుంచి జిల్లా గౌరవాధ్యక్షులు దాసరి బాబన్న, పండిత పరిషత్ రాష్ట్ర కార్యదర్శి వివేక్, భవానీ, మడావి కొండూ పాల్గొన్నారు.

# డీఎల్ఎడ్‌లో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో డీఎల్ఎడ్ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లకు మరో సారి స్పాట్ ఆడ్మిషన్లకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని మండలం లోని ఎల్ఎండీలో గల డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. డీసెట్ 2025 ఉత్తీర్ణులై అర్హత, ఆసక్తి ఉండి ఇప్పటి వరకు ప్రవేశంపొందని అభ్యర్థులు డీసెట్2025 వెబ్సైట్ను పరిశీలించి తమ మాధ్యమంలో తమతమ కేటగిరి సీట్లుఖాళీగా ఉన్న కళాశాలలను తెలుసుకోవాలని అన్నారు. అన్నిఒరిజినల్ సర్టిఫికేట్లు తీసుకొని ఈనెల 26న ఉదయం 10గంటలకు ఎల్ఎండీ కాలనీలో గల ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థకురావాలని, 28న ప్రైవేటు కళాశాలకు ఉదయం 10గంటలకు వెళ్లి సీటు కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.



# ఉత్తమ ఉపాధ్యాయురాలిగా నాంపల్లి కవిత

**శెనార్తి మీడియా, ఆదిలాబాద్ :**

తాంసి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న నాంపల్లి కవిత వేదాస్ టీజీ ప్రొఫెసర్ జయశంకర్ సార్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలు ఎంపికైంది.. ఈ అవార్డు ఆదివారం హైదరాబాదులో వేదాస్ అసోసియేషన్ వారు అందించారు.. నాంపల్లి కవిత దంపతులను శాలువా ల తో సత్కరించి మెమొంటో అందించారు.. నాంపల్లి కవిత ఉపాధ్యాయ వృత్తిలో అందించిన సేవలకు ఈ అవార్డు ఎంపిక చేసినట్లు సంస్థ సభ్యు లు తెలిపారు... అవార్డు ఎంపికైన ఉపాధ్యాయురాలని పలువురు అభినందించారు...




# సేవలందించిన భక్తులకు వస్త్రాల పంపిణీ



**శెనార్తి మీడియా, తలమడుగు:**

శ్రావణమాసంలో మండలంలోని కజ్జర్ల గ్రామంలో నెల రోజుల పాటు నిర్వహించిన శబరిమాత అఖండ జ్యోతి కార్యక్రమంలో నిర్విరామంగా సేవలందించిన భక్తులకు కజ్జర్ల గ్రామానికి చెందిన వెల్మ స్వామి రెడ్డి వెంకటమ్మ దంపతులు రూ.లక్ష వ్యయంతో వంద మందికి వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారీ వర్షాలను కూడా లెక్కచేయకుండా దూడా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, గ్రామ భక్తులలో ఉత్తమ సేవలందించిన వారిని గుర్తించి వస్త్రాలు పంపిణీ చేశారు. అలాగే గ్రామంలోని రామాల యం శివాలయం, పోచమ్మ ఆలయంలో సేవలు చేస్తున్న భక్తులకు కూడా వస్త్రాలన పంపిణీ చేశారు. గ్రామ పెద్దలు చింతలపెల్లి దేవారెడ్డి, జైభారత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కమలాకర్, శార్త స్వామి మాజీ సర్పంచులు నారాయణరెడ్డి, గణేష్, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయబావిలో పడి చిన్నారి మృతి

**శెనార్తి మీడియా, శంకరపట్నం/ సైదాపూర్ :**

ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి 18 నెలల బాలుడు దుర్మరణం చెందిన సంఘటన కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని రాయికల్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చీరాల కావ్య వెంకటయ్య దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నాడు. కౌశిక్ నంద్ (18 నెలలు)ను ఎత్తుకొని ఇంటి సమీపంలో ఉన్న వ్యవసాయ బావి వద్దకు వెళ్లి బాలుడిని వ్యవసాయ బావి వద్ద కూర్చొబెట్టి పొలానికి నీళ్లు వదిలారు. ఈ క్రమంలోనే బాలుడు ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందినట్లు తెలిపారు. దీంతో బాలుడు తల్లి కళ్ళ ముందే ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడడంతో కేకలు వేసింది. దీంతో చుట్టుపక్కల ఉన్నవారు వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. వ్యవసాయ బావిలో నీరు నిండుగా ఉండడంతో బాలుడి మృతదేహాన్ని తీసేందుకు పంపుసెట్ల ద్వారా నీటిని తోడే ప్రయత్నం చేస్తున్నారు.